
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | శుక్రవారం జూన్ ,13 ,2025 | సంపుటి:2 | సంచి 257 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-



# కుప్పకూలిన విమానం

# 242 మంది దుర్మరణం



విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ పాటు ఒక కెనడా వాసి

- అహ్మదాబాద్ నుంచి లండన్ కు వెళ్తుండగా ఈ ప్రమాదం
- టేకాఫ్ అయిన కాసేపటికే కుప్పకూలిన ఎయిరిండియా విమానం
- మృతుల్లో మాజీ సీఎం విజయ్ రూపానీ
- కోపైలట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడి
- 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయిన విమానం
- ఘటనపై ఆరా తీసిన హోంమంత్రి అమిత్ షా



తెలంగాణ వీణ, గాంధీనగర్, /

మహా ఘోరం జరిగింది. గుజరాత్‌లో ఘోర విమానప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో దాదాపు 242మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో మాజీ సిఎం విజయ్ రూపానీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. మేఘానిలో ఎయిర్‌ఇండియా విమానం కూలిపోయింది. సివిల్ ఆస్పత్రి సమీపంలో విమానం చెట్టును ఢీకొట్టిన అనంతరం జనావాసాలపై కూలింది. టేకాఫ్ అయిన వెంటనే విమానం కూలి -మిగతా 2 లో

## ఆర్థిక భద్రతలో సీఏలదే కీలక పాత్ర


- మీ నిజాయితీయే మీ అత్యంత విలువైన ఆస్తీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణ వీణ, హైదరాబాద్

దేశ ఆర్థిక ఆరోగ్య భద్రతను చార్టెడ్ అకౌంట్లు సమర్థంగా నిర్వహిస్తున్నారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. జాతీయ స్థాయి సిఎ విద్యార్థుల సదస్సులో భాగంగా ముఖ్యోపన్యాసం ఇచ్చారు.

-మిగతా 2 లో



## విమాన ప్రమాదం తో మోడీ దిగ్భ్రాంతి

- కేంద్రమంత్రి అమిత్ షా, రామ్మోహన్‌లతో ఆరా
- తక్షణం వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షించాలని ఆదేశం

తెలంగాణ వీణ,న్యూఢిల్లీ,

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే కుప్పకూలింది. ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే ప్రమాదంపై ఆరా తీశారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ఫోన్లో మాట్లాడిన ప్రధాని.. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యల వేగవంతం కోసం -మిగతా 2 లో

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

### 36మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు


- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్
- ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నవీన్ మిట్టల్
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరి

తెలంగాణ వీణ, హైదరాబాద్,

తెలంగాణ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. 36 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నవీన్ మిట్టల్‌ను బదిలీ చేసింది. ఇక ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను నియమించింది. ఢిల్లీలోని తెలంగాణ భవన్




రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్‌ను బదిలీ చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా లోకేష్ కుమార్‌ను నియమించింది. ఆయనకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) చీఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. -మిగతా 2 లో



## విమాన దుర్ఘటన మహా విషాదం

- ఘటనా స్థలిని పరిశీలించిన రామ్మోహన్, అమిత్ షా
- దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు
- కుట్ర కోణం ఉంటే ఎవ్వరినీ వదలం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

తెలంగాణ వీణ,అహ్మదాబాద్,


అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటన మహావిషాదమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మృతుల్లో చిన్నారులు సైతం ఉన్నారన్నారు. ఈ విమాన ప్రమాద ఘటన తెలిసిన వెంటనే గన్నవరం నుంచి ప్రత్యేక -మిగతా 2 లో

## మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

- మెడికల్ కాలేజీ హాస్టల్ భవన పునర్నిర్మాణం
- ప్రమాదంలో రమేశ్ అనే వ్యక్తి మృత్యుంజయుడు
- టాటా గ్రూప్ సంస్థ ప్రకటన విడుదల

అహ్మదాబాద్,

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై టాటా గ్రూప్ స్పందించింది. ఈ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూప్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఆ యా కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని వెల్లడించింది. ఆసుపత్రిలో -మిగతా 2 లో




## ప్రమాదం పై సీఎం రేవంత్ రెడ్డి విచారం

తెలంగాణ వీణ,హైదరాబాద్,

అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన దుర్ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో దాదాపు 200 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారనే సమాచారం తెలియటంతో.. అందరూ సురక్షితంగా ఉండాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. బాధితులను, వారి కుటుంబాలను ఆదుకోవడానికి వీలైనంత వేగంగా సమర్థవంతంగా సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



## మృత్యుంజయుడిగా బయటపడ్డ రమేష్ కుమార్

### విమాన ప్రమాద ఘటనలో ఒకేఒక్కడు

తెలంగాణ వీణ,అహ్మదాబాద్

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఒకే ఒక్కడు బతికాడు. అతను మృత్యుంజయుడిగా నిలిచాడు. విశ్వాస్ కుమార్ రమేష్ లండన్ వెళుతున్న ప్రయాణికుల్లో బతికి బయటపడ్డాడు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా -మిగతా 2 లో




## ట్రంప్ గోల్డ్‌కార్డు వెబ్‌సైట్ ప్రారంభం

- అధికారికంగా పేర్ల రిజిస్ట్రేషన్‌కు ఆహ్వానం
- 50 లక్షల డాలర్లతో గ్రీన్‌కార్డుకు రాచమార్గం



తెలంగాణ వీణ,వాషింగ్టన్

ఎంతోకాలంగా ఊరిస్తూ వస్తున్న గోల్డ్ కార్డు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రారంభించారు. విదేశీ వలసదారులు అమెరికా-మిగతా 2 లో

# కుప్ప కూలిన విమానం

(మొదటి పేజీ తరువాయి)

పోయింది. 242 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 అనే విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విమానంలో ఉన్న 242 మృతి చెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఇందులో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారు. అంబులెన్స్‌లు, ఫైరింజిన్లు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బిఎస్ఎఫ్ సిబ్బంది సిబ్బంది సహాయకచర్యల్లో పాల్గొన్నారు. పరిసరప్రాంతాల్లో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. 2కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు గుజరాత్ కు బయల్దేరారు. ప్రమాదంపై గుజరాత్ సిఎంకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోన్ చేసి ఆరా తీశారు. విమానంలో మాజీ సిఎం విజయ్ రూపానీ ఉన్నట్లు సమాచారం. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు ఉన్నారు. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఆ ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ అన్ని వైపులకు వ్యాపించింది. ఫ్లైట్ రాడార్



24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన విమానం వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్. దీనిలో 300 మంది ప్రయాణించవచ్చు. ఇది 11 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. సుదూర ప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీగా ఉండటంతో.. ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. విమాన కూలిన విషయం తెలియగానే ఫైర్ ఇంజిన్లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఆ విమానంలో ఉన్నట్లు ఏబీపీ పత్రిక పేర్కొంది. ఈ ప్రమాదం విషయం తెలియడంతో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలానికి బయల్దేరారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు. ఈ ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పందించింది. విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు- పేర్కొంది. సుమిత్‌కు ఎల్‌టీసీగా 8,200 గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఏటీసీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్‌వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఏటీసీకి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్‌లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు- చేసినట్లు- తెలిపింది. తమ సామాజిక మాధ్యమం, ఎయిర్‌ఇండియా వెబ్‌సైట్‌లో కూడా ప్రమాద వివరాలు, అప్‌డేట్లు- ఉంటాయని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే తదుపరి ప్రకటన వెలువడే వరకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ ఆపరేషన్స్‌ను సస్పెండ్ చేశారు.

# విమాన దుర్ఘటన మహా విషాదం

(మొదటి పేజీ తరువాయి)

విమానంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అహ్మదాబాద్ చేరుకున్నారు. అనంతరం విమాన ప్రమాద ఘనట చోటు- చేసుకున్న ప్రదేశానికి ఆయన చేరుకుని.. ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. విమాన ప్రమాద ఘటన తీరును ఉన్నతాధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పరిశీలన కోసమే తాను అహ్మదాబాద్ వచ్చినట్లు- తెలిపారు. ఈ విమాన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఆయన అభివర్ణించారు. అన్ని విభాగాల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో నిష్పాక్షికమైన సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. విమాన ప్రమాదం ఎందుకు జరిగిందో దర్యాప్తు చేస్తామన్నారు. విమాన ప్రమాద బాధ్యులను ఉపేక్షించమని కేంద్రం మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అయితే మృతుల సంఖ్యలను కనుగోనవలసి ఉందిని ఉందన్నారు. ఈ విమాన ప్రమాదంలో మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారని తెలిసి చాలా బాధగా ఉందని తెలిపారు. ఈ విమానంలో ఇతర దేశాలకు చెందిన జాతీయులు సైతం ఉన్నారని చెప్పారు. ఈ విషాదకరమైన, భయంకరమైన సంఘటనతో తాను పూర్తిగా షాక్ అయ్యానన్నారు. తాను ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నానని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ తనకు ఫోన్ చేసి సంఘటన స్థలంలో ఉండమని కోరారని వివరించారు. ఈ సమయంలో, నేను ప్రయాణీకులు, వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించగలనన్నారు. అనేక సంస్థలు సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నాయని గుర్తు చేశారు. బాధితులకు అన్ని రకాల సహాయం అందిస్తున్నామన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. అన్ని కోణాల్లో లోతైన, నిష్పాక్షికమైన దర్యాప్తు చేస్తాం. అధికారులతో సమావేశం అనంతరం మరిన్ని వివరాలు అందిస్తాం. విమానంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ఉన్నారు. ఈ ప్రమాదానికి బాధ్యులను ఉపేక్షించం అన్నారు. మరోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అహ్మదాబాద్ చేరుకున్నారు. ఆయన సైతం సంఘటన స్థలానికి వచ్చారు. ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. సహాయక చర్యలపై ఆరా తీశారు.

### మృత్యుంజయుడిగా బయటపడ్డ

# రమేష్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)



విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. ఈ విమానంలో ప్రయాణిస్తున్న అందరూ ప్రాణాలు కోల్పోయారని వార్తలు వచ్చాయి. అయితే ఒక్క వ్యక్తి అంత పెద్ద దుర్ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. అంత పెద్ద ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఆ వ్యక్తి పేరు విశ్వాస్ కుమార్ రమేష్. భారత సంతతికి చెందిన ఇతడికి బ్రిటన్ పౌరసత్వం ఉంది. భారత్‌లో ఉంటున్న తన కుటుంబ సభ్యులను కలిసేందుకు అతడు ఇటీవల ఇక్కడి వచ్చాడు. తిరిగి లండన్ వెళ్లేందుకు ఎయిరిండియా విమానం ఎక్కాడు. అతడు తన సోదరుడితో కలిసి ప్రయాణిస్తున్నాడు. ఆ సోదరుడి ఆచూకీ మాత్రం ఇప్పటివరకు లభ్యం కాలేదు. విశ్వాస్ ఎయిరిండియా విమానంలో సీట్ నెంబర్ 11ఆలో కూర్చుని ప్రయాణిస్తున్నాడు.హాస్పిటల్‌లో చికిత్స అనంతరం స్పృహలోకి వచ్చిన విశ్వాస్ ప్రమాదం తర్వాత తన పరిస్థితిని వివరించాడు. నాకు స్పృహ వచ్చే సరికి నా చుట్టూ మృతదేహాలున్నాయి. నాకు చాలా భయం వేసింది. నేను పైకి లేచి పరిగెత్తాను. ఎక్కడ చూసినా విమానం శిథిలాలే కనబడ్డాయి. నన్ను ఎవరో పైకి పట్టుకుని ఆంబులెన్స్ ఎక్కించి హాస్పిటల్‌కు తీసుకొచ్చారని తేరుకున్న తరవాత వివరించాడు.

# ట్రంప్ గోల్డ్‌కార్డు వెబ్‌సైట్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వానికి 50 లక్షల డాలర్లు(దాదాపు రూ. 43 కోట్లు) చెల్లించడం ద్వారా అమెరికా పౌరసత్వాన్ని పొందేందుకు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడమే ఈ గోల్డ్ కార్డు ఉద్దేశం. ప్రపంచంలో ఎక్కడా లేని అత్యంత గొప్ప దేశానికి, మార్కెట్‌కు దారి చూపించే అద్భుత ప్రయాణం సాగించేందుకు ఎక్కడ సంతకం చేయాలని వేలాదిమంది తనను అడుగుతున్నట్లు ట్రంప్ తన ట్రూత్ పోస్టులో పేర్కొన్నారు.

**దరఖాస్తు ఎలా?**

ట్రంప్ కార్డుపై ఆసక్తి ఉన్న వారిని మాత్రమే వెబ్‌సైట్ అనుమతిస్తోంది. అభ్యర్థి తన పేరు, మతం, చిరునామాను రిజిస్టర్ చేసుకోవలసి ఉంటుంది. trumpcard.gov పేరుతోఉన్న ఈ కొత్త వైబ్‌సైట్‌లో బంగారు రంగు కార్డు నమూనాను ఉంచారు. కార్డుపైన 5 మిలియన్ డాలర్లని అంకె ముద్రించారు. యూరప్, ఆసియా(పశ్చిమాసియాతో సహా), ఉత్తర అమెరికా, ఓషియానియా, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా, కరీబియన్, ఆఫ్రికా వంటి 8 ప్రాంతాల నుంచి మాత్రమే దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

### ఆర్థిక భద్రతలో

# సీఏలదే కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. సిఎ అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, ఇది జాతి నిర్మాణంలో భాగస్వామ్యం అన్నారు. మీ నిజాయితీయే మీ అత్యంత విలువైన ఆస్తి. -టెక్నాలజీ, ఆటోమేషన్ వేగంగా మారుతున్న ఈ యుగంలో నైతికతకు కట్టు-బడి ఉండే అవసరం మరింత పెరిగింది. మీరు చేసే ప్రతి పని నిజాయితీ, సమన్యాయం, బాధ్యతను ప్రతిబింబించాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. భవిష్యత్ తెలంగాణను ప్రపంచ పటంలో నిలపాలనే లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం అనేక మెగాపథకాలపై దృష్టిసారించినట్లు- భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యంగా, హైదరాబాద్‌ను చార్టెడ్ అకౌంట్లకు ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పార్కుల ద్వారా హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. తెలంగాణ ఈ రోజు దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ- పడుతోంది. రీజినల్ రింగ్ రోడ్, మూసీ రివైటలైజేషన్, ఫ్యూచర్ సిటీ- ప్రాజెక్టుల వంటి యోచనలతో తెలంగాణ అభివృద్ధిలో మైలురాళ్లుగా నిలుస్తోంది,‘ అని డిప్యూటీ- సీఎం వ్యాఖ్యానించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు భట్టి విక్రమార్క జ్ఞానాన్ని, నైతికతను రెండు చేతుల్లో పట్టు-కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చార్టెడ్ అకౌంట్ల కృషి తెలంగాణ రైజింగ్ లో భాగస్వామ్యం కావాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకెళ్లేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

### విమాన ప్రమాదం తో

# మోడీ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వివరాలను తనకు అప్‌డేట్ చేయాలని కేంద్రమంత్రిని ఆదేశించారు. అటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే అహ్మదాబాద్ వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని రామ్మోహన్ నాయుడు, అమిత్ షాకు ప్రధాని సూచించారు. విమాన ప్రమాదంపై దర్యాప్తు చేయనున్నట్లు పౌరవిమానయాన శాఖ వర్గాలు వెల్లడించాయి. అటు- ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) రంగంలోకి దిగింది. ఏఏఐబీ డీజీ, ఇతర అధికారులు ఘటనాస్థలానికి బయల్దేరారు. ప్రమాదానికి గల కారణాలపై వారు సమీక్ష చేపట్టనున్నారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ-171 విమానం కాసేపటికే కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో అందులో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 169 మంది భారతీయులు.. 53 మంది బ్రిటన్ పౌరులు. ప్రయాణికుల్లో గుజరాత్ మాజీ సీఎం, భాజపా నేత విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

### తెలంగాణలో భారీగా

# ఐఏఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమించింది. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎండీగా జె.శంకరయ్యను నియమించింది. తెలంగాణ భవన్ ముఖ్య కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బదిలీ చేసింది. సమాచార కమిషన్ సెక్రటరీగా భారతీ లకపతినాయక్‌ను నియమించింది. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీష్, నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా టి.వినయ్ కృష్ణారెడ్డిని బదిలీ చేసింది. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీగా రాజీవ్‌గాంధీ హనుమంతును నియమించింది. స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఈ నవీన్ నికోలస్‌ను బదిలీ చేసింది. ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌గా కె. శివకుమార్ నాయుడును నియమించింది. ఇక సాధారణ పరిపాలన శాఖ సంయుక్త కార్యదర్శిగా చిట్టెం లక్ష్మిని బదిలీ చేసింది. జి. సృజనకి మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. వ్యవసాయ, సహకారశాఖ సంయుక్త కార్యదర్శిగా ఎల్. శివశంకర్‌ను నియమించింది.


# మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నీ భరిస్తామని టాటా గ్రూప్ సంస్థ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. బీజే మెడికల్ కాలేజ్ హాస్టల్ భవనాన్ని పునర్నిర్మిస్తామని వెల్లడించింది. ఈ మేరకు గురువారం టాటా గ్రూప్ ఎక్స్ వేదికగా స్పందించింది. మరోవైపు ఈ ప్రమాద ఘటన నుంచి ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని అహ్మదాబాద్ నగర పోలీస్ కమిషనర్ వెల్లడించారు. 11ఏ సీటు- ప్రయాణికుడు రమేశ్ బతికారన్నారు. ఈ ప్రమాదం నుంచి బయటపడిన రమేశ్ బిశ్వాస్‌కు ఆసుపత్రిలో చికిత్స జరుగుతోందని వివరించారు. ఈ ప్రమాద మృతుల సంఖ్యపై ఇప్పుడే తామేమీ చెప్పలేమన్నారు. నివాస ప్రాంతంలో విమానం కూలినందున మృతుల సంఖ్య ఎక్కువే ఉండ వచ్చని అహ్మదాబాద్ నగర పోలీస్ కమిషనర్ అభిప్రాయపడ్డారు. జూన్ 12వ తేదీ మధ్యాహ్నం 1.39 గంటలకు అహ్మదాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి లండన్‌కు ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయింది. ఆ కొన్ని నిమిషాలకే ఆ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 241 మంది మరణించారు. వీరిలో 229 మంది ప్రయాణికులు, 12 మంది విమాన సిబ్బంది ఉన్నారు. న్యూఢిల్లీ నుంచి వయా అహ్మదాబాద్ మీదగా లండన్‌కు ఈ విమానం వెళ్తోంది. మరోవైపు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈ ఘటన జరిగిన వెంటనే కేంద్ర మంత్రులు అమిత్ షా, రామ్మోహన్ నాయుడులు వేర్వేరుగా అహ్మదాబాద్‌కు చేరుకుని ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్ఠిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811


## అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మృతి



**తెలంగాణ వీణ, అహ్మదాబాద్ .**
అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ(68) మృతి చెందారు. అయితే విజయ్ రూపానీ మృతి చెందినట్లు గుజరాత్ ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించింది. ఎయిరిండియా విమానం కూలిన ఘటనలో ఎవరూ బతికి ఉండే అవకాశం లేదని అహ్మదాబాద్ సీపీ ప్రకటించారు. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోనే విజయ్ రూపానీ లండన్ బయల్దేరినట్లు బోర్డింగ్ పాస్ కూడా బయటకు వచ్చింది. అంతేకాకుండా విమానంలో ప్రమాదానికి ముందు ఓ వ్యక్తి విజయ్ రూపానీతో సెల్ఫీ దిగిన ఫొటో కూడా బయటకు వచ్చింది.విజయ్ రూపానీ 2016 నుంచి 2021 వరకు గుజరాత్‌కు 16వ ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఆరు దశాబ్దాల క్రితం గుజరాత్ రెండో సీఎం బల్వంత్‌రాయ్ మెహతా కూడా ఇలాగే విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. 1965 సెప్టెంబర్‌లో, గుజరాత్ రెండో సీఎం బల్వంత్ రాయ్ మెహతా అహ్మదాబాద్ నుండి మిఠాపూర్‌కు విమానంలో ప్రయాణిస్తుండగా, ఇండో-పాక్ యుద్ధంలో పాకిస్తాన్ వైమానిక దళం ఆ విమానాన్ని కూల్చివేసింది. ఈ ప్రమాదంలో మెహతా భార్యతో పాటు సహాయకులు, ఒక జర్నలిస్టు కూడా ప్రాణాలు కోల్పోయారు.

## శత్రుదేశ డ్రోన్లను కూల్చితే నెలకు రూ.2.2 లక్షలు..

### వినూత్న కార్యక్రమానికి ఉక్రెయిన్ శ్రీకారం



**తెలంగాణ వీణ, ఉక్రెయిన్**
ఉక్రెయిన్ పై రష్యా విరుచుకుపడుతోంది. రకరకాల డ్రోన్లు, మిస్సైళ్లతో అటాక్ చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా డ్రోన్ దాడులను అడ్డుకునేందుకు ఉక్రెయిన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శత్రు దేశం నుంచి వస్తున్న డ్రోన్లను కూల్చేందుకు సైన్యం ప్రమేయం లేకుండా కొంత నగదు ఇచ్చి వాలంటీర్లను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద శత్రుదేశ డ్రోన్లను గుర్తించి, నేలకూల్చే పౌరులకు నెలకు సుమారు రూ. 2.2 లక్షల వరకు జీతం అందించనున్నట్లు వెల్లడించింది.ఉక్రెయిన్ రక్షణ శాఖ ప్రతిపాదించిన ఈ కార్యక్రమానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేసినట్లు ప్రభుత్వ ప్రతినిధి తారాస్ మెల్నిచుక్ టెలిగ్రామ్‌లో ప్రకటించారు. ఈ పథకం కింద, ప్రత్యేకంగా శిక్షణ పొందిన వాలంటీర్లను, డ్రోన్ ఆపరేటింగ్ నైపుణ్యాలు కలిగిన పారామిలిటరీ సభ్యులను నియమించనున్నారు. వీరు మానవరహిత విమానాలు, ఆయుధాలు వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రష్యా డ్రోన్లను పసిగట్టి, వాటిని కూల్చివేయాల్సి ఉంటుంది. ఇందుకు అయ్యే ఖర్చును స్థానిక బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. మార్షల్ లా ఉండే రెండేళ్ల వరకు ఈ పథకం కొనసాగుతుందని ఉక్రెయిన్ వార్తా సంస్థ కీవ్ వెల్లడించింది.

## 2 జీవిత ఖైదు శిక్షలు పడితే, అమలు ఎలా?

### విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం



**తెలంగాణ వీణ, న్యూఢిల్లీ**
ఓ వ్యక్తికి రెండుసార్లు జీవిత ఖైదు శిక్షలు పడినపుడు, వాటిలో ఒకటి పూర్తయిన తర్వాత మరొకదానిని అమలు చేయవచ్చునా? అనే ప్రశ్నపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు గురువారం అంగీకరించింది. 2010లో జరిగిన జంట హత్యల కేసులో దోషికి పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు రెండు జీవిత ఖైదులను విధిస్తూ 2015లో తీర్పు చెప్పింది.తుది శ్వాస వరకు జైలులో ఖైదీగా ఉండాలని చెప్పేదే జీవిత ఖైదు అని, రెండు జీవిత ఖైదు శిక్షలను విధించడం నిష్ప్రయోజనకరమని తెలిపింది. శిక్ష తగ్గింపు, క్షమాభిక్ష వల్ల ఆ జీవిత ఖైదు శిక్షా కాలం తగ్గిపోతుందని గుర్తు చేసింది. అటువంటి పరిస్థితుల్లో శిక్ష అమలు ప్రారంభమవుతుందని పేర్కొంది. పిటిషనర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టులో గురువారం వాదనలు వినిపించారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై టాటా గ్రూప్ కీలక ప్రకటన




**తెలంగాణ వీణ, హైదరాబాద్**
అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా పెను ప్రమాదంపై తాజాగా యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. విమానంలో మొత్తం 242 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో 169 మంది భారతీయులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే 53 మంది బ్రిటన్ జాతీయులు ఉన్నట్లు సమాచారం. ఏడు మంది పోర్చుగీస్ అలాగే ఓ కెనడియన్ ఉన్నాడని ఎయిర్ ఇండియా తెలిపింది. ఈ పెను ప్రమాదంపై టాటా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఎయిర్ ఇండియా 171 విమానం ప్రమాదానికి గురి కావడం విషాదకరమని పోస్ట్ పెట్టింది. అలాగే మృతుల కుటుంబాలకు అటు క్షతగాత్రులకు టాటా గ్రూప్ ప్రగాఢ సానుభూతి ప్రకటించింది . బాధితులకు అండగా ఉంటామని, ఆదుకుంటామని టాటా గ్రూప్ కూడా స్పష్టం చేసింది. ఈ ప్రమాదంపై విచారణ చేయిస్తామని%ా% ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదని వివరించింది. ఘటనా స్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. గుజరాత్ అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం చోటు చేసుకుంది. 242 మంది ప్రయాణికులతో లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం.. ఎయిర్ పోర్ట్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే మేఘానిలో సివిల్ ఆస్పత్రి సమీపంలో జనావాసాలపై కూలిపోయింది. దీంతో ఒక్కసారిగా మంటలు అలుముకోవడంతో.. పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఈ సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. అలాగే క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## కర్ణాటక, ఏపీ మధ్య మామిడి లడాయి


### -తోతాపురి మామిడిపై ఏపీ నిషేధం.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అభ్యంతరం



**తెలంగాణ వీణ, న్యూఢిల్లీ,**
కర్ణాటక, ఏపీ మధ్య మామిడి పండ్ల రవాణాపై వివాదం ఏర్పడింది. కర్ణాటక నుంచి చిత్తూరు జిల్లాకు వచ్చే తోతాపురి మామిడిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలంటూ ఏపీ సీఎం చంద్రబాబుకు కర్ణాటక కాంగ్రెస్ సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. ఈ ఏడాది చిత్తూరు జిల్లాలో పెద్దఎత్తున మామిడి పండడంతో, సరైన ధర రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు కర్ణాటక నుంచి కూడా తోతాపురి మామిడి భారీగాదిగుమతి కావడంతో ధర మరింత దిగజారే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో తోతాపురి మామిడి ఇతర రాష్ట్రాల నుంచి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించడాన్ని నిషేధిస్తూ జూన్ 7న ఆ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఏపీ ప్రభుత్వ చర్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సిద్దరామయ్య.. మామిడిపై నిషేధాన్ని ఆకస్మిక, ఏకపక్ష చర్యగా పేర్కొన్నారు. ఈ నిషేధం కర్ణాటక సరిహద్దులోని రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. చిత్తూరుకు చెందిన పల్ప్ ప్రాసెసింగ్, ఇతర మార్కెటింగ్ విధానాల ద్వారా అక్కడ తమ మామిడిని అమ్మడానికి రైతులు ఎన్నో ఏండ్లుగా ఆధారపడ్డారని, ఏపీ ప్రభుత్వ చర్య కారణంగా సరుకు రవాణా వ్యవస్థ దెబ్బతినడమే కాక, వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఈ నిషేధం సహకార సమాఖ్య సిద్ధాంతాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు.

## రుద్రాస్త్ర పరీక్షలు విజయవంతం

**తెలంగాణ వీణ, న్యూఢిల్లీ**



పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన హైబ్రిడ్ వీటీఓఎల్ యూఏవీ రుద్రాస్త్ర పరీక్షలు విజయవంతమయ్యాయి. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మానవ రహిత గగనతల వాహనం (యూఏవీ) అసాధారణ పనితీరును కనబరచింది. భారత సైన్యం నిర్దేశించిన అన్ని కార్యకలాపాల పరామితులకు అనుగుణంగా పని చేసింది. వెర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (వీటీఓఎల్) సామర్థ్యాలు సహా, లక్ష్యాన్ని అత్యంత కచ్చితంగా ఛేదించడం, మిషన్ ఫ్లెక్సిబిలిటీ వంటి అన్ని అంశాల్లో విజయవంతమైంది.రన్‌వే అవసరం లేకుండానే నిలువుగా ఎగరగలిగే, భూమిపైకి దిగగలిగే సామర్థ్యాన్నే వీటీఓఎల్ అంటారు. రుద్రాస్త్ర తనకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించిన తర్వాత తాను ప్రారంభమైన చోటుకు తిరిగి సురక్షితంగా వచ్చింది. లక్షిత ప్రాంతంలో సంచరించే సామర్థ్యం సహా మొత్తం పరిధి 170 కి.మీ. దాటింది.

## 24 గంటల్లో 117 కొత్త కేసులు నమోదు..


### -మూడు మరణాలు



**తెలంగాణ వీణ, న్యూఢిల్లీ**
దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత 24 గంటల్లో 117 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7,154కి ఎగబాకింది.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం . కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,165 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 1,281 కేసులు, పశ్చిమ బెంగాల్‌లో 747, ఢిల్లీలో 731, మహారాష్ట్రలో 615 కేసులు, కర్ణాటకలో 467, ఉత్తరప్రదేశ్‌లో 231, ఉత్తరప్రదేశ్‌లో 227 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో మూడు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఇద్దరు, మధ్యప్రదేశ్‌లో ఒకరు మరణించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 77కి ఎగబాకింది. ఇక ఇప్పటి వరకూ 9,556 మంది కరోనా నుంచి కోలుకున్నారు.

## ప్రపంచ లింగ అసమానతల్లో దిగజారిన భారత్

### 146 దేశాల జాబితాలో 131వ స్థానం




**తెలంగాణ వీణ, న్యూఢిల్లీ**
ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించిన ప్రపంచ లింగ అసమానత నివేదిక-2025లో భారత్ నిరుడుతో పోలిస్తే రెండు స్థానాలు కిందకు దిగజారి 131వ స్థానంలో నిలిచింది. 64.1 శాతం స్కోర్‌తో దక్షిణాసియాలో అతి తక్కువ ర్యాంక్ పొందిన దేశంగా అపకీర్తిని మూటగట్టుకుంది. గురువారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలు, విద్యార్జన, ఆరోగ్యం-మనుగడ, రాజకీయ సాధికారత వంటి కీలకాంశాల ప్రాతిపదికన ఈ నివేదికను రూపొందించారు.ఆర్థిక భాగస్వామ్యం, విద్యార్జన అంశాల్లో భారత్ కొంత మెరుగైన ఫలితాలను(40.7 శాతం) సాధించింది. శ్రామిక శక్తి భాగస్వామ్యం నిరుడు ఎంతో ఉందో(45.9 శాతం) ఈ సంవత్సరం అంతే ఉంది. విద్యార్జనను పరిశీలిస్తే మహిళల అక్షరాస్యత, విద్యా సంస్థల్లో వారి ప్రవేశాల స్థాయిలో మెరుగుదల కనిపించింది. లింగ నిష్పత్తి, ఆరోగ్యం-మనుగడ అంశాల్లో భారత్ ప్రగతి సాధించినప్పటికీ స్త్రీ-పురుషుల ఆయుర్దాయం తగ్గింది. రాజకీయ సాధికారతలోనూ భారత్ పాయింట్లు కాస్త (-0.6) తగ్గాయి




# యూపీఐ పేమెంట్లపై పన్ను బాదుడు

-దుమారం చెలరేగడంతో వెనక్కి తగ్గిన కేంద్రం
-భాగస్వామ్య పక్షాల ప్రభావం లేకుండా మోడీ నిర్ణయాలు




తెలంగాణవీణ, న్యూఢిల్లీ

మోడీ గత పదేళ్ల ప్రభుత్వానికి, ఎన్‌డిఎ పక్షాలతో మద్దతుతో నడుస్తున్న ఏడాది పాలనకు పెద్దగా తేడా కనిపించడం లేదు. తనదోవన తాను నడుస్తున్నారు. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదు. జూన్ 9 నాటికి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుంది. మద్దతు ఇస్తున్న ప్రధాన పార్టీల్లో టిడిపి,జెడియూ లు తమ స్వలాభం కోసం పనిచేసు కుంటున్నారు. నితీశ్ కేవలం బీహార్ వ్యవహారాలకే పరిమితం అయ్యారు. వచ్చే ఎన్నికల్లో గులవడం కోసం కేంద్రం నుంచి పనులు చేయించుకునే పనిలో పడ్డారు. అలాగే చంద్రబాబు కూడా ఎపిని పునరుద్దరించుకునే పనిలో అనేకానేక పథకాలు, నిధుల విడుదల కోసం పనిచేసుకుంటున్నారు. పోలవరం, అమరావతి, బనకచర్ల వంటి ప్రాజెక్టులను పట్టాలకెక్కించుకునే పనిలో ఉన్నారు. ఈ ఇద్దరికీ ఉమ్మడిగా దేశం గురించి ఆలోచించి మోడీని డైరెక్ట్ చేసేంతగా దృష్టి పెట్టడం లేదు. యూపిఎ పేమెంట్లపై ట్యాక్స్ విధించాలన్న దుమారం చెలరేగింది. దీనిని కేంద్రం ఖండించినా ఎక్కడో నిప్పులేనిదే పొగరాదు. దీనిపై తాత్కాలికంగా నిర్ణయం వాయిదా వేసి ఉంటారు. ఇలాంటి వాటిపైనా డబ్బులు గుంజాలనే ఆలోచనలో మోడీ ఉన్నారు. ఇప్పటివరకు యూపీఐ మీద ఎలాంటి ఛార్జీలను విధించడం లేదు. అయితే త్వరలోనే ఈ లావాదేవీలపై కూడా ఛార్జీలను వసూలు చేయాలని కేంద్రం భావిస్తున్నట్టు- వార్తలు వచ్చాయి. ఆ వార్తలను తాజాగా ఆర్థిక శాఖ ఖండించింది. డిజిటల్ లావాదేవీలను నిర్వహించడం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో వీరికి సహకరించేందుకు మర్చెంట్ డిస్కౌంట్ రేట్‌లను వసూలు చేయాలని కేంద్రం ఆలోచిస్తోందని వార్తలు వచ్చాయి. అయితే ఆ వార్తలు కేవలం ఊహాజనితాలని, ఛార్జీలు వసూలు చేసే ఆలోచన లేదని ఆర్థిక శాఖ తెలిపింది. యూపీఐ ద్వారా 3000 రూపాయల పైచిలుకు చెల్లింపులు జరిగితే ఎండీఆర్ ఛార్జీలను వసూలు చేస్తారని జాతీయ మీడియా పేర్కొంది. నిజానికి 2020 నుంచి జీరో ఎండీఆర్ పాలసీ అమల్లో ఉంది. ఇలాంటి వాటిపై ప్రజ్లో ఆందోళన వస్తున్నా టిడిపి లాంటి పార్టీ కూడా పట్టించుకోవడం లేదు. ఎన్‌డిఎకు మద్దుతగా ఉన్నామన్న విషయం మరచిపోయారేమో. తెలుగుదేశం, జనతాదళ్ యునైటెడ్ పొత్తుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మోడీ ఇలాంటి నిర్ణయాలపై భాగస్వామ్య పక్షాలతో చర్చించడం లేదు. చంద్రబాబు, నితీశ్ కుమార్‌లు కూడా వీటిని అడగడం లేదు. తెలుగుదేశం, జెడి(యు) పార్టీలకు ఎన్‌డిఎ ప్రభుత్వంలో అత్యున్నత భాగస్వామ్యం పొందే అవకాశం లభించింది. ఈ అవకాశం అన్నిప్రాంతీయ పార్టీలకు లభించలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు తలెత్తడంతో ప్రస్తుతం బిజూ జనతాదళ్, బహుజన సమాజ్, జననాయక్ జనతా,టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె ఈ ఐదు ప్రాంతీయ పార్టీల ఉనికి దెబ్బతింది. ఇవి తిరిగి కోలుకుంటాయన్న నమ్మకం కూడా కలగడం లేదు. ఈ పార్టీలన్నీ పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించే అవకాశాన్ని కోల్పోయాయి. ఈ పార్టీలన్నీ ఒకప్పుడు ముఖ్యమంత్రులను,ఒకానొక సందర్భంలో పార్లమెంట్ కు విశేష సంఖ్యలో ఎంపిలను పంపించినవేనని గుర్తించాలి. 1997లో బిజూ జనతాదళ్ ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎలాంటి ఎదురీత లేని పార్టీ ఇప్పుడు పార్లమెంట్‌లో తన ప్రాతినిధ్యం అన్నది లేకుండా పోయింది. మొట్టమొదటిసారి 2009 తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ మెజార్టీ సాధించుకోలేకపోయింది. గత 24 ఏళు ్గా తిరుగులేని ముఖ్యమంత్రిగా నెగ్గుకుంటూ వచ్చిన నవీన్ పట్నాయక్ ఇప్పుడు పక్కకు తప్పుకోవలసి వచ్చింది. ప్రాంతీయ పార్టీల్లో ఒకప్పుడు మిగతా పార్టీలన్నిటినీ తుడిచిపెట్టేసిన బిజూ జనతాదళ్ పార్టీ ఇప్పుడు ఈ ఏడాది ఒక్క సీటు కూడా సాధించలేని స్థితికి దిగజారిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీది కూడా ఇదే పరిస్థితి. ఒకప్పుడు దళితుల గొంతుగా గుర్తింపు పొందిన బిఎస్పీ ఉత్తరప్రదేశ్‌లో తన పట్టును కోల్పోయే పరిస్థితి దాపురించింది. హర్యానాలో ఉత్తర ఎగువ నియోజక వర్గంలో జననాయక్ జనతా పార్టీ కూడా రాష్ట్రంలోని తనకున్న పది స్థానాలను కోల్పోయింది. ఇంకా దక్షిణాదిలో తమిళనాడుకు చెందిన ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె)ను అగ్రనటుడు, ఎంజిఆర్ స్థాపించగా, తరువాత నటి జయలలిత సారథ్యం వహించారు. ఆమె ఉన్నంతకాలం పార్టీ బాగా నడిచింది. ఆటుపోట్లను ఎదుర్కొంది.. కానీ ఇప్పుడా పార్టీకి మనుగడ లేనట్టుగానే భావించాలి. ఇక తెలంగాణలోనూ దశాబ్దం పాటు పాలించిన కెసిఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందారు. ఆరు నెలల వ్యవధిలో వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపి సీట్లలో ఒక్కటి కూడా గెలవలేదు. ప్రజల్లో పునాది వేసుకుంటే తప్ప నిలబడవని గుర్తించాలి. టిడిపి అలాకాకుండా ప్రజలతో నిరంతరాయంగా పెనవేసుకుని ముందుకు సాగేలా చేసుకోవడం వల్లనే నిలబడ గలిగింది. తన ప్రజాస్వామ్య మూలాలను ఎక్కడా వదులుకోకపోవడం వల్లనే ఇది సాధ్యం అయ్యింది. అందువల్ల కేంద్రంలో కీలకంగా ఉన్నందున, ప్రజావ్యతిరేక నిర్ణయాలను అంతర్గతంగా చర్చించాలి. జిఎస్టీ వంటి బాదుళ్లపైనా చర్చించాలి. అలాగే యూపిఎ పేమెంట్లపైనా చర్చించాలి. అప్పుడే చంద్రబాబుకు విలువ పెరుగుతుంది. భాగస్వామ్య పక్షాలు పట్టుబిగిస్తేనే ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాలపై మోడీ వెనకడుగు వేస్తారు.

# 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33% రిజర్వేషన్లు!

-జన, కులగణన పూర్తయ్యాక డీలిమిటేషన్
-ఆ తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు
-కేంద్ర ప్రభుత్వం యోచన
-జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు



తెలంగాణవీణ, న్యూఢిల్లీ,

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఇండియా టుడే టీవీకి గురువారం ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2027లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ నిర్వహిస్తామని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత వారం ప్రకటించింది. మొట్టమొదటిసారి ఇందులో కులగణన కూడా భాగం కానున్నది. ఇది రెండు విడతలుగా జరగనున్నది హిమపాతం అధికంగా ఉండే పర్వత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్ము కశ్మీరు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలలో 2026 అక్టోబర్‌లో, మిగిలిన రాష్ట్రాలలో 2027లో ఈ ప్రక్రియ జరగనున్నది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన నిర్వహించనున్నారు. రెండేళ్లలో జనాభా లెక్కల సేకరణ పూర్తవుతుందని, తాజా జనాభా గణాంకాల ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023 సెప్టెంబర్‌లో పార్లమెంట్ ఆమోదం పొందిన నారీ శక్తి వందన్ అధినియం లేక మహిళా రిజర్వేషన్ బిల్లు, 2023కు అనుగుణంగా 33 శాతం రిజర్వేషన్ కోటా అమలు అవుతుంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన ఈ చట్టం ఆమోదం పొందిన తర్వాత నిర్వహించే తొలి జనాభా లెక్కల సేకరణ ఆధారంగా అమలులోకి వస్తుంది.

**27 ఏళ్ల తర్వాత ఆమోదం**

దేవెగౌడ ప్రధానిగా ఉన్నపుడు 1996లో మొదటిసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు మారిన అనేక ప్రభుత్వాలను, చర్చలను వీక్షించి 27 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు ఆమోదం పొందింది. ఈ చట్టంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం అమలులోకి వచ్చిన తర్వాత 15 సంవత్సరాల పాటు మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాలలో ఎటువంటి మార్పులు ఉండవు.

# 17న పాలస్తీనా సంఘీభావ దినం

తెలంగాణవీణ, విజయవాడ

జూన్ 17న పాలస్తీనా సంఘీభావ దినంగా పాటించాలని రాష్ట్రంలోని తొమ్మిది వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ లీడర్ పి.ప్రసాద్, జాస్తి కిషోర్ బాబు సిపిఐ(యంఎల్), కాటం.నాగభూషణం యంసిపిఐ(యు), బి.బంగారాావు సిపిఐ(యంఎల్) లిబరేషన్, బి.ఎస్.అమర్‌నాథ్.. యస్‌యుసిఐ(సి), పి.వి.సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) నేతలు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రకటనలో%ో% "గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. 20 మాసాలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫ్లోటిల్లాకు చెందిన మాడ్‌లీన్ ఓడపై ఇజ్రాయిల్ జరిపిన దాడిని కూడా వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతక వైఖరిని అవలంబిస్తున్నది. వలసవాద వ్యతిరేక సంఘీభావం, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతునిస్తూ భారత్ సుదీర్ఘకాలంగా అనుసరిస్తూ వచ్చిన వలసవాద వ్యతిరేక, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతు ఇచ్చే విదేశాంగ విధానం నుండి వెనక్కి తగ్గడం సిగ్గుచేటు. పాలస్తీనా ప్రయోజనాలకు ఇప్పటివరకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలి. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలి.


సంపాదకీయం

# పార్టీల్లో ప్రజాస్వామ్యం బలపడాలి !

తెలుగుదేశం పార్టీ ఏర్పడిన నాటి నుంచి ఏనాడూ ఏకపక్షంగా వ్యవహరించలేదు. కుటుంబం అదుపులో పార్టీ ఉన్నా ఉమ్మడి నిర్ణయాలు, ప్రజాస్వామ్య విధానాలతో ముందుకు సాగుతోంది. గతేడాది కూటమిగా జనసేన, బిజెపితో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరవాత కూడా తెలుగుదేశం పార్టీ ఏనాడూ ప్రజాస్వామిక గీతను దాటలేదు. లోకేష్‌ను తన వారసుడిగా పార్టీలో ఎదిగేలా చేస్తున్నా..టిడిపి ఎప్పుడూ ప్రజల పక్షంగానే సాగుతోంది. పవన్ కళ్యాణ్ జనసేన, బిజెపిల కలయికతో ఇప్పుడు ఎపిలో కూటమి ఓ మంచి పాలన అందించగలుగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ మాత్రం ఇంకా అధిష్టానం అడుగులకు మడుగులు ఒత్తుతూ సాగుతోంది. కాంగ్రెస్ తన విధానాలు మార్చుకోవడం లేదు. పార్టీ సోనియా కుటుంబం కబంధ హస్తాల్లో ఉండడం వల్ల ప్రతి నిర్ణయానికి స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశం లేదు. అందుకే సిఎం రేవంత్ రెడ్డి ప్రతి చిన్ని విషయానికి ఢిల్లీకి పరుగెత్తాల్సి వస్తోంది. మంత్రివర్గ విస్తరణ ఏడాదిన్నర దాటిన తరవాత చేపట్టినా, శాఖల కేటాయింపు కూడా మళ్లీ అధిష్టానం నిర్ణయంతో వారి కనుసన్నల్లోనే సాగాయి. బిఆర్‌ఎస్‌లో కూడా కెసిఆర్, కెటిఆర్ నిర్ణయాలే ఫైనల్. వారికీ కాంగ్రెస్‌కు పెద్దగా తేడా ఉండదు. కానీ తెలుగుదేశంలో పోలిట్ బ్యూరో,కార్యవర్గం తదితర ఏర్పాట్లు ఉన్నాయి. భారతదేశం పునాదులే ప్రజాస్వామి క వ్యవస్థపై ఉన్నాయి. రాజకీయ పార్టీలు కూడా ఇదే విధానం అవలంబించి, ప్రజల్లో ఉన్నంతకాలం మనగలుగుతాయి. అలాకాకుండా ఏకపక్ష, నిరంకుశ, కుటుంబ పాలనకు కట్టుబడితే అవి కాలక్రమంలో అంతర్థానం అవుతాయి. తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ ఎన్టీ రామారావు ఓ ఉదాత్త ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ఉన్నంత కాలం పార్టీని అదే ఆశయంతో నడిపించారు. పార్టీ ఏర్పాటుతో బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ ప్రవేశం దక్కింది. ఎందరికో టిడిపి రాజకీయ ఆశ్రయం ఇచ్చింది. రాజకీయాల్లో ఒకప్పుడు పెత్తందారులే ఉండేవారు. ఎన్టీఆర్ వచ్చాక పరిస్థితి మారింది. బడుగు,బలహీన వర్గాలు ఎందరో రాజకీయాంగా ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా మార్పులు తీసుకుని రావడంలో టిడిపి కీలక భూమిక పోషించింది.ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ప్రజల్లో నిరంతరంగా నిలిచి వారితో కలసి నడిచిన పార్టీగా ఇప్పటికీ టిడిపి ప్రధాన భూమిక పోషిస్తోంది. ప్రధానంగా బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు రాజకీయ వేదికగా నిలిచింది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం నింపింది. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు అందుకున్నాక కూడా పార్టీని నిరంతరం ప్రజల్లో ఉండేలా చేయడంలో విజయం సాధించారు. ఆ మేరకు కృతకృత్యులు అయ్యారు. ఇది ప్రజల పార్టీ అని నిరూపించడం వెనక ఆయన శ్రమ ఉంది. అలాగే ఏనాడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదు. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు అధికారంలో ఉన్నా..లేకున్నా ప్రజల్లో నిలవడానికి కూడా కారణం అదే. అంకితభావం కలిగిన కార్యకర్తలు తోడుగా ఉన్నారు. పార్టీలోకి ఎందరో వచ్చినా.. ఎందరో వెళ్లినా, అధికారంలో ఉన్నా, అధికారంలో లేకున్నా పార్టీ మాత్రం ప్రజాస్వామ్య విలువలు చెక్కుచెదరలేదు. ఓ రకంగా చెప్పాలంటే చంద్రబాబు దక్షతకు ఇది నిదర్శనం. దేశంలో ఎన్నో పార్టీలు వచ్చాయి. పోయాయి. ఎందరో తెరమరుగు అయ్యారు. ఎన్నో పార్టీలు ప్రజల నుంచి దూరం అయ్యాయి. అయితే టిడిపి మాత్రం తన ఉనికిని చాటుతూ ప్రజల్లో నిరంతరంగా ఉండేలా ఎప్పటి కప్పుడు తన ప్రణాళికలు మార్చుకుంటూ ముందుకు సాగడంలో నాయకత్వం చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. తేడాది మరోమారు టిడిపి అధికారంలోకి వచ్చింది. జగన్ ఐదేళ్ల పాటు ఎంతగా వేధంచినా, రాష్ట్రాన్ని పక్కదాని పట్టించి అభివృద్ధిని పక్కన పడేసినా టిడిప తన పోరాటాన్ని వీడలేదు. కాలనుగణంగా ఎన్‌డిఎతో కలసి పోరాడింది. అంతిమంగా ఎపి అభివృద్ధి లక్ష్యంగా ఇప్పుడు అడుగులు వేస్తున్నారు. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో, ఓ 15 ఏళ్లు విపక్షంలో ఉన్నా.. పార్టీని ఎక్కడా పట్టు సడలకుండా కాపాడుకోగలిగారు. కొందరు నేతలు పార్టీని విడిచి వెళ్లినా పట్టించుకోలేదు. గత ఐదేళ్లలో జగన్ చంద్రబాబునే టార్గెట్ చేసి,టిడిపిని అణచివేయాలని చూశారు. కేసులతో నేతలను జైల్లో వేయించారు. అలాగే అనేక రకాలుగా విధ్వంస పాలన చేసారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పట్టించుకోలేదు. ఇదంతా విపక్షాల దుష్ప్రచారంగా ప్రచారం చేశారు. అయినా టిడిపి ఎక్కడా చెక్కుచెదరలేదు. తన పట్టును వీడలేదు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేసింది. ప్రజల్లో విశ్వాసం కలిగించింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రాంతీయ పార్టీల్లో గట్టిగా నిలబడ గలిగిన పార్టీల్లో తెలుగుదేశం ముందుంటుంది. కానీ తెలంగాణలో బిఆర్‌ఎస్ నిత్యం సంక్షోభాలతో సాగుతోంది. కేవలం అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే నేతలు వెన్నంటి ఉన్నారు. కెసిఆర్ నిరంకుశ విధానాలు ఆ పార్టీని దెబ్బతీసాయి. ఈ విధానాలపై ఇప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోవడం లేదు. జగన్ లాగే అప్పులు చేసి, రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ప్రజలు ఆదరించి అక్కున చేర్చు కుంటే కేసిఆర్ వారికే పంగనామాలు పెట్టి, పాలనలో దొరలపోకడలను చొప్పించి, నిరంకుశ విధానాలను అనుసరించారు. ప్రజలు ఇలాంటి పార్టీ మనకొద్దని ఎన్నికల్లో ఓడించారు. కానీ అధికారం చేపట్టిన కాంగ్రెస్ కూడా తన విధానాలు మార్చుకోకుండా ఏడాదిన్నరలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్న బిజెపిలో మోడీ నిరంకుశ విధానాలతో పార్టీని దిగజార్చారు. ఎన్‌డిఎ పక్షాలతో ఇప్పుడు ఆ పార్టీ నిలబడ్డా.. అవే విధానాలను మోడీ కొనసాగిస్తే..బిజెపిని కూడా ప్రజలు దూరం చేసుకుంటారని. మోడీ ద్వయం అనుసరించిన నిరంకుశ విధానాల కారణంగా గతేడాది ఎన్నికల్లో గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో ప్రజలను పట్టించుకోక పోవడంతో ప్రజలు మోడీకి కూడా చెక్ పెట్టేంత పని చేసారు. ఇదో హెచ్చరికగా మోడీ గుర్తించాలి.

# ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రావలసిన వేతనం ఇప్పించిన

### బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**తెలంగాణ వీణ,కుత్బుల్లాపూర్...**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి ఇండస్ట్రీ ఏరియాలో "ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్" లో ఓనర్ కిషోర్ దగ్గర అమరేందర్ కుమార్, డీజే, మంతోష్, ముగ్గురు కార్మికులు ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ కిషోర్ దగ్గర చేసేవారు... కొన్ని అనివార్య కారణాలవల్ల వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తూ ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేయడం జరిగింది.. మొత్తం ముగ్గురికి కలిపి రావాల్సిన వేతనం 70,000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ కిషోర్ ను ఎంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు అమరేందర్ కుమార్, డీజే, మంతోష్, తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి.. హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ కిషోర్ తో పలుమార్లు చర్చించి కార్మికులు ముగ్గురికి కలిపి మొత్తం రావాల్సిన వేతనం, 70,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... ఫ్యాబ్రికేషన్ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన రవి కి ప్రత్యేక ధన్యవాదాలు, తెలియజేశారు... ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

# గాడి తప్పిన విద్యా వ్యవస్థ చక్కబెట్టేదెవరు

### -దృహన్ ఓయు అధ్యక్షులు




**తెలంగాణ వీణ/ఓయూ:**
గత పాలకుల పాలనలో విద్యావ్యవస్థ, యూనివర్సిటీలు మొత్తం నిర్వీయం చేశారని. ప్రభుత్వ విద్య గాడితప్పిందని విద్యార్థులంతా ఏకమై గొంతెత్తి నినదించి పాలకులను కూలదోషి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశమిస్తే అందలమెక్కిన నాయకులు కూడా అదే తీరుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సర కాలం గడుస్తున్నపడికి ఇంకా విద్యా శాఖకు మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరం. మంత్రివర్గ విస్తీరణ జరుగుతుంది కొత్త మంత్రులొస్తున్నారు అన్న తరుణంలో మా విద్యాశాఖకు ఈసారైనా మంత్రిని నియమిస్తారేమోనని కళలు కన్నది విద్యార్థి లోకం కానీ మా ఆశలు అడియాశలు చేస్తూ మరో సారి విద్యార్థుల ఆశలపై నీళ్ళు జల్లింది ఈ ప్రభుత్వం విద్యా కమీషన్ అనే పేరుతో ఓ కమీషన్ ని నియమించింది. కానీ వారు విద్యాశాఖ పట్ల చిత్తశుద్ధితో ఏనాడు పని చేసింది లేదు కావున ఇప్పడికైనా ప్రభుత్వానికి విద్య పట్ల చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖకు మంత్రిని నియమించి తమ చిత్తశుద్ధి చాటుకోవాలని కోరుకుంటున్నాను లేని యెడలో రాష్ట్రమంతా ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాము.

# పేదవారి సొంతింటి కల నెరవేర్చి ఇండ్ల పట్టాలను అందజేసిన కాంగ్రెస్ ప్రభుత్వం







**తెలంగాణ వీణ/ చేగుంట...**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో భాగంగా దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట మండలం చేగుంట గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆద్వర్యంలో నిరుపేద కుటుంబ లబ్ధిదారులకు సుమారు 50 ఇందిరమ్మ ఇళ్ల పట్టాల మంజూరు పత్రాలను దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్ల నవీన్ కుమార్, పంపిణీ చేశారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ 10 సంవత్సరాల తరువాత ఇళ్ల పట్టాలు ఇచ్చినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, గారికి జిల్లా ఇంఛార్జి మంత్రి వర్యులు కొండ సురేఖ, గారికి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, గారికి ఎల్లపుడూ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నగేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్ల నవీన్ కుమార్, స్టాలిన్ నర్సింలు, కురుమ లక్ష్మి, ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిత పరంజ్యోతి సంద్రుగు శ్రీకాంత్, పుర్ర ఆగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ నాయక్,ST సెల్ అధ్యక్షులు ఫకీర్ నాయక్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులకు ఎన్నికలలో... పంచాయతీ సమరానికి సిద్ధం.






**-స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఉవిల్లూరుతున్న అభ్యర్థులు.**
**-కాసుల వేటలో ఆశావహుల బీజీబీజీ.**
**-మేమంటే మేముంటున్న అధికార, ప్రతిపక్ష నేతలు.**
**-జిహ్వ చావని మాజీ ప్రజా ప్రతినిధులు.**
**-తామూ పోటీలో ఉంటామంటూ సంకేతాలు.**

**తెలంగాణ వీణ,మహేశ్వరం:**
త్వరలో జరగబోయే పంచాయితీ సమరానికి ఇటు ఆశావహులు, అటు మాజీ ప్రజా ప్రతినిధులు సర్వం సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వశక్తులు వడ్డీ గెలుపే లక్ష్యంగా పావులు కలుపుతున్నారు. గ్రామంలో నాయకులు గెలుపే లక్ష్యంగా ఉవ్విళ్లూరుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జూన్ చివరి వారంలో లేదా జూలైలో నిర్వహించే అవకాశం ఉన్నందున ఆశావాహులు, అభ్యర్థులు కాసుల వేటలో తల మునకలయ్యారు. గ్రామాలలో చాప కింద నీరులా ఎన్నికల వాతావరణం నెలకొన్నది. గ్రామాలలో ఒకరికి తెలవకుండా ఒకరు బరిలో నిలిచేందుకు సర్వశక్తులను ఒడ్డుతున్నారు. పల్లెలలో నాయకులు యువతను, మహిళలను మచ్చిక చేసుకునే ప్రయత్నాలలో నిమగ్నమయ్యారు. బీఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు ఇప్పటివరకు అన్ని పదవులను భర్తీ చేసి ఎప్పుడు ఎన్నికలను నిర్వహించిన సై అంటున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఇంతవరకు గ్రామ, మండల, బ్లాక్, జిల్లాస్థాయి పదవులను భర్తీ చేయకపోవడంతో కాంగ్రెస్ పార్టీ చతికిల పడిపోయిందని కొంతమంది కాంగ్రెస్ పార్టీలోని నాయకులే చర్చించుకుంటున్నారు. మరి కొంత మంది తాజా, మాజీ నాయకులు ఆర్థికంగా ఉండడంతో గ్రామాలలో జరిగే పెండ్లీలకు, పేరంటాలకు, మంచి, చెడులకు నజరానాలు అందజేయడం జోరందుకుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తాజా, మాజీ సర్పంచులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచిన కాంగ్రెస్ నాయకులు ఇప్పటివరకు పెద్దగా క్యాడర్ లో జోష్ నింపే పనిలో పెద్ద స్థాయి నాయకులు లేరనే విమర్శలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా గాని గ్రామాలలో బీఆర్ఎస్ బలమే ఎక్కువ శాతం ఉందనేది ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదే అదనుగా భావించి బిజెపి నాయకత్వం పంచాయతీలలో పాగా వేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కొంతమంది మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి పరచామని మళ్లీ గెలుపే లక్ష్యంగా పావులు కలుపుతున్నారు. మరి కొంతమంది మాజీ సర్పంచులు గత సర్పంచుల పాలనలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఆదేశం మేరకు ఎన్నో లక్షలను ఖర్చు చేశామని ఆ బిల్లులు రాకపోవడంతో సర్పంచి పదవులపై ఆశలు వదులుకుంటున్నారు. ప్రభుత్వం జూలైలో ఎన్నికలు నిర్వహిస్తామనే సంకేతాలు ఇవ్వడంతో గ్రామాలలో ఆశావాహుల జోరు ఊపందుకుంటుంది.ఏది ఏమైనా ఈ దప స్థానిక పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి నాయకులకు ఒక రెఫరండంగా మిగలనున్నాయి.

# అంగన్వాడి చిన్నారుల ర్యాలీ






**తెలంగాణ వీణ,తార్నాక:**
తార్నాక డివిజన్ పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లో గురువారం 'అమ్మ మాట- అంగన్వాడి బాట పేరుతో అంగన్వాడి సిబ్బంది. చిన్నారులు ర్యాలీలు నిర్వహించారు. ఆర్యనగర్ అంగన్వాడి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సంధ్యా పాల్గొన్నారు. అంగన్వాడి సేవలను ఉపయోగించుకోవాలనీ కోరారు. 3 సంవత్సరాల లోపు చిన్నారులను తప్పకుండా ఆంగన్వాడి కేంద్రానికి పంపించాలనీ అన్నారు. ఇక్కడ పోషకాహారంతో పాటు ఆటా పాటలతో కూడిన ప్రాథమిక స్థాయి విద్యాబోధన చేయడం జరుగుతందని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు ఎగ్ బిర్యాణి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ బాలమణి, సిబ్బంది లక్ష్మీ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.తార్నాక చింతల్, లాలాపేట చంద్రబాబునగర్1.2, సాయినగర్, వినోభానగర్ పెద్ద నల్లా అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట- అంగన్వాడి బాట కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి 3 సంవత్సరాల లోపు చిన్నారులను ఎన్రోల్మెంట్ చేసుకున్నారు. అంగన్వాడి కేంద్రాల ఆద్వారా అందిస్తున్న సేవలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రేణుక, ఆంగన్వాడి టీచర్లు కృపావతి, సంధ్య, రోజా, సుజాత, గోదావరి, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్కారు బడులలో విద్యార్థులను చేర్పించాలి.

### హెచ్ఎం శ్రీశైలం.



**తెలంగాణ వీణ,మహేశ్వరం...**
ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించాలని సుభాన్ పూర్ హెచ్ఎం. శ్రీశైలం అన్నారు. గురువారం సుభాన్ పూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుత్తి పద్మ పాండు తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఉపాధ్యాయులు ఉండి ఒక లక్ష్య సాధనలో విద్యాభ్యాసం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ గుత్తి పద్మ పాండు విద్యార్థులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. మహిళా సంఘం సభ్యురాలు భాగ్య రేఖ టై, బెల్టు, ఐడి కార్డులు, బ్యాగ్స్ బుక్కులను పంపిణీ చేశారు. 6, 7 తరగతిలో ఎనిమిది మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు హెచ్ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, వెంకటస్వామి, హేమలత, అనిల్, రాజేశ్వరి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ సమావేశ తీర్మానాలు..



**తెలంగాణ వీణ/ఓయూ:**
ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం స్ఫూర్తి ఛాత్ర శక్తి భవన్ లో 2025 మే 29 నుండి 31 వరకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రవేశపెట్టిన తీర్మానాల గురించి మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఐదు ప్రధాన తీర్మానాలు ఆమోదించబడ్డాయి.కోచింగ్ సెంటర్ల అనైతిక విధానాలను నియంత్రించేందుకు విధాన రూపకల్పనపై డిమాండ్.కేంద్ర విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్ల నియామకాల్లో ఆలస్యం పట్ల ఆందోళన.అంతర్గత భద్రత, భారత గ్లోబల్ స్థానం పై చర్చ.తాజా జియోపాలిటికల్ పరిస్థితుల్లో భారత పోజిషన్ పై తీర్మానం.'సిందూర్', 'కాగర్' వంటి మిలిటరీ ఆపరేషన్లలో భారత సైన్యం చూపిన ధైర్యాన్ని ఏబీవీపీ అభినందించడం.ఈ మీడియా సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్ బి రాజ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు అలివేలు రాజు, కందడి శ్రీరామ్, రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు సాక్షి పాల్గొన్నారు.

# చార్మినార్‌లో బాల కార్మిక వ్యతిరేక అవగాహన కార్యక్రమం







### ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రిత ఆధ్వర్యంలో చైతన్య పరచిన చారిత్రక కార్యక్రమం

**తెలంగాణ వీణ,హైదరాబాద్...**
ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్, మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కమిషన్ సభ్యులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతదయాకర్ రెడ్డి మాట్లాడుతూ "ప్రతి పిల్లవాడు విద్య ద్వారా ఎదగాలి. వారిని శ్రమలో నెట్టడం అనైతికమే కాకుండా చట్టవిరుద్ధం కూడా. సమాజం అంతటా కలిసికట్టుగా స్పందిస్తేనే బాల కార్మిక నిర్మూలన సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ "ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేస్తోంది. కానీ సామాజిక అవగాహన లేకుండా దీన్ని పూర్తిస్థాయిలో సాధించలేం" అని తెలిపారు.మహిళా భద్రతా విభాగం కమిషనర్ లావణ్య నాయక్ మాట్లాడుతూ ు "బాలల భద్రత బాధ్యతగా తీసుకోవాల్సింది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలంతా కలిసి పనిచేయాలి" అని సూచించారు. ఆశ్రిత సంస్థ అధికారి పర్వతాలు మాట్లాడుతూ ు "సామాజిక స్పృహతోనే మార్పు సాధ్యం. గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణాలలోనూ చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు కంచెర్ల వందన, మర్రిపల్లి చందన, బి. అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి. వచన్ కుమార్, చార్మినార్ డివిజన్ కార్పొరేటర్, జిల్లా బాలల సంరక్షణ అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ, బాల కార్మిక నిర్మూలనపై ప్రదర్శనలు ఇచ్చారు. అంతేగాక, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ సమస్యపై చైతన్యం కలిగించాయి.ఈ కార్యక్రమానికి షాహిన్, ఆర్ఎఫ్ఐ, బ్లూ ఫౌండేషన్, మంచికలలు, ఎస్.ఆర్. ఎడ్యుకేషన్ సొసైటీ తదితర స్వచ్ఛంద సంస్థలు మద్దతుగా నిలిచాయి. "పిల్లల కోసం ు బాల కార్మిక వ్యతిరేక పోరాటం" అనే నినాదంతో ఈ అవగాహన కార్యక్రమం ముగిసింది.

# తార్నాక శ్రీ చైతన్య స్కూల్ కు ఉత్సాహంగా మొదటి రోజు విద్యార్థులు



**తెలంగాణ వీణ/తార్నాక:**
వేసవి సెలవులు అయిపోయిన తర్వాత న్యూ అకడమిక్ ఇయర్ కోసం విద్యార్థులు హుషారుగా స్కూలుకు వచ్చారు. శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యం కూడా విద్యార్థులకు నూతన ఉత్తేజం కల్పించేలా తార్నాక శ్రీ చైతన్య స్కూల్లో మామిడి తోరణాలు, బెలూన్లు ఏర్పాటుచేసి, ముగ్గులు వేసి, అలంకరణ చేయడంతో విద్యార్థులకు కొత్తదనంతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు తమ స్కూలుకు మొదటి రోజు రావడంతోనే నూతనంగా స్కూల్ కనిపించడంతో పరిసరాలను వింతగా చూస్తూ ఆశ్చర్యపోతూ స్కూల్లో అడుగు పెట్టారు. ఈ సందర్భంగా జోన్ ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ ఎగువ తరగతిలో అడుగుపెడుతున్న విద్యార్థులకు నూతనంగా చేరిన నర్సరీ చిన్నారులకు కొత్తదనం కనిపించేలా ఆహ్లాదకరం ఉండేలా పలు ఏర్పాట్లు చేసి వచ్చిన విద్యార్థులను స్వాగతం పలికేలా కార్యక్రమం చేపట్టామన్నారు. స్కూల్ పరిసరాలను అందంగా అలంకరించిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ప్రశాంతి, డీన్ సృజన్ తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

# అమ్మ మాట,అంగన్వాడీ బాట,సామూహిక అక్షరబ్యాసం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీమతి రాగమయి దయానంద్,

**తెలంగాణ వీణ,సత్తుపల్లి...**
సత్తుపల్లి పట్టణంలో గల జలగం నగర్ అంగంవాడీ భవనంలో అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం సుమారు 20 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాం లు, పలక, బలపములు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు నాణ్యమైన పోషక ఆహారం చిన్నారులకు అంగన్వాడీ టీచర్ల ద్వారా ఆట పాటలతో పాటు ఆహ్లాదకరమైన మంచి చదువు అందిస్తున్నామన్నారు



ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రిలు బట్టి,తుమ్మల, పొంగులేటి, కి ధన్యవాదాలు తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు ఆహ్లాదకరమైన ఆటపాటలతో, అమ్మ ఒడిలాంటి కమ్మని ప్రేమని అందిస్తున్న ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలకు మట్టా రాగమయి దయానంద్ అభినందించారు. సుమారు 20 మంది చిన్నారులకు జలగం నగర్ అంగన్వాడి కేంద్రంలో స్వయంగా అక్షరాభ్యాసం చేయించి చిన్నారులకు అక్షింతలు వేసి, బొట్టు పెట్టి వారి చదువు భవిష్యత్తు మంచిగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్వైజర్లు, సత్తుపల్లి పట్టణ అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడి ఆయాలు, సత్తుపల్లి పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు..

# మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ను కలిసిన .మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య గౌడ్



**తెలంగాణ వీణ/ గరిడేపల్లి:**
హుజూర్నగర్ నియోజకవర్గ, గరిడేపల్లి మండల బిజెపి ఉపాధ్యక్షుడిగా కుక్కడపు లక్ష్మయ్య గౌడ్ ఎన్నికైన సందర్భంగా గురువారం బిజెపి సూర్యాపేట జిల్లా ఆఫీసులో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మరియు జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి కడియం రామచంద్రయ్య బూర మన్సూర్ చిత్తలూరి సోమయ్య గౌడ్ కలిసి బిజెపి పార్టీని గరిడేపల్లి మండలంలో బలోపితం చేస్తాడని వారితో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా బుర్ర నరసయ్య గౌడ్ ఆశీస్సులు తీసుకోవడం లక్ష్మయ్య గౌడ్ తీసుకున్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన


**తెలంగాణ వీణ,గోపాల్ పేట్ :**
మండలంలోని చెన్నూర్, గోపాల్‌పేట రైతు వేదిక లో వికసిత కృషి సంకల్ప అభియాన్ మరియు ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహనా కల్పించారు
వికసిత కృషి సంకల్ప అభియాన్ అనేది ఖరీద్ పంటల ముందస్తు సాగు మరియు దాని మెరుగైన రకాలు, అలాగే నేల ఆరోగ్య నిర్వహణ మరియు అన్ని అంశాలపై దృష్టి సారించే 15 రోజుల అవగాహన ముగింపు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని రైతు వేదిక లో గురువారం గుజరాత్ నుండి ప్రత్యక్ష ప్రసారం గోపాల్‌పేట రైతు వేదికలో వెబ్‌కాస్ట్ చేశారు.జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ పంట మార్పిడి చేసుకోవాలి నూనె గింజలు ప్రాముఖ్యత మరియు అముదం లో మెరుగైన హైబ్రిడ్‌ల మరియు అధిక రాబడి కోసం రైతులను దాని వైపు వెల్లవచు అని రైతులకు సూచించారు మరియు జీవన ఎరువులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కె వి కె మదనపురం సీనియర్ శాస్త్రవేత్త రాజేంద్ర కుమార్ మాట్లాడు తూ పచ్చి రొట్ట పంటలైన జీలుగ మరియు జనుము




వాడకాన్ని, వరి, వేరుశన, మినుముల పంటలలో యాజమాన్య పద్ధతులు మరియు చిరు ధాన్యాలు వేసుకోవాలని రైతులకు సూచించారు. డాక్టర్ భవానీ, మాట్లాడుతు రైతులకు ప్రధాన పంటలైన వరి రకాలు మరియు విత్తడానికి సరైన సమయం, అందుబాటులో ఉన్న పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు మండల పశు వైద్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ టీకాలు మరియు పశువైద్య పథకాలు గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కె వి కె మదనపురం సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి రాజేంద్ర కుమార్ , డాక్టర్ భవానీ, జాతియ నూనే గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ. మంజునాథ్, వ్యవసాయ అధికారి కరుణ, పశువైద్యుడు ఆంజనేయులు , వ్యవసాయ విస్తీర్ణ అధికారి నాగరాజు, మరియు జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## వరి గంటలో అమ్మకాలు.. భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు..




**తెలంగాణవీణ, బిజినెస్**

అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ఇరాన్–ఇజ్రాయేల్ మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల్లో పెరుగుదల కారణంగా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను అరశాతం మేర తగ్గించడంతో ఈ వారం సూచీలు వరుసగా లాభపడ్డాయి. గరిష్టాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఈ రోజు నష్టాలను చవిచూశాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ గురువారం నష్టాలను మూటగట్టుకున్నాయి.బుధవారం ముగింపు (82, 515)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభ నష్టాలతో దోబూచులాడింది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలయ్యాయి. చివరి గంటలో భారీగా అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ పతనమైంది. ఒక దశలో ఇంట్రాడే హై నుంచి ఏకంగా 1100 పాయింట్లు కోల్పోయింది. చివరకు సెన్సెక్స్ 823 పాయింట్ల నష్టంతో 81, 691 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 253 పాయింట్ల నష్టంతో 24, 888 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో టొరెంట్ ఫార్మా, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఆర్బీఎల్ బ్యాంక్, ఎస్బీఐ కార్డ్ షేర్లు లాభాల్లో ముగిశాయి. పేటీఎమ్, సీడీఎస్–ఎల్, హిందుస్తాన్ పెట్రో, బీపీసీఎల్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 947 పాయింట్ల నష్టంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 377 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.60గా ఉంది.

## మళ్లీ భారీగా పెరిగిన ధరలు..

**తెలంగాణవీణ, బిజినెస్**

బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రెండు నెలల క్రితం లక్ష రూపాయలను ఢీకొట్టిన బంగారం ధర ఆ తర్వాత మెల్లిగా తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలోనే.. గురువారం బంగారం ధర భారీగా పెరిగింది. 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర లక్ష మార్కుకు చేరువైంది. దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,280గా ఉంది. కిలో వెండి ధర ఒక లక్షా 9వేలు పలుకుతోంది. అయితే.. ప్రాంతాల వారీగా బంగారం ధరలు మారుతుంటాయి.. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి..హైదరాబాద్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.880 పెరిగి రూ.99,280 కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.800 పెరిగి రూ.91,000 లుగా ఉంది. కేజీ వెండిపై రూ.100 తగ్గి రూ. 1,18,900గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10



గ్రాముల పసిడి ధర రూ.880 పెరిగి రూ.99,280 కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.800 పెరిగి రూ.91,000 లుగా ఉంది. కేజీ వెండిపై రూ.100 తగ్గి రూ.1,18,900గా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 9,928, 22 క్యారెట్ల ధర 90,100 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,08,900 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.99,430, 22 క్యారెట్ల ధర 90,115గా ఉంది కిలో వెండి ధర రూ.1,08,900 లుగా ఉంది.


చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.99,280, 22 క్యారెట్ల ధర 90,100గా ఉండగా.. కిలో వెండి ధర రూ.1,18,900 లుగా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,280, 22 క్యారెట్ల ధర 90,100గా ఉండగా.. కిలో వెండి ధర రూ.1,08,900 లుగా ఉంది.

## యూఎస్ స్టాక్స్‌పై భారతీయ పెట్టుబడిదారుల ఆసక్తి

**తెలంగాణవీణ, బిజినెస్**

యుఎస్ స్టాక్ మార్కెట్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ కంపెనీలలో కొన్నింటికి ఆతిథ్యం ఇస్తుంది. ఆపిల్, గూగుల్, ఫేస్‌బుక్, జనరల్ మోటార్స్ వంటి కంపెనీలు యూఎస్ స్టాక్ మార్కెట్‌లో ఉంటాయి. ఈ ప్రపంచ దిగ్గజాలలో పెట్టుబడి పెట్టడం వలన మీరు మీ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరచవచ్చు మరియు భారత స్టాక్ మార్కెట్ దాటి వారి వృద్ధి ప్రయాణంలో పాల్గొనవచ్చు. భారతదేశంలో అమెరికా స్టాక్ బ్రోకర్లు లేనందున అమెరికా ఈక్విటీలలో పెట్టుబడిదారులు పాల్గొనడానికి సహాయపడటానికి అనేక భారతీయ వేదికలు ఉన్నాయి. భారతీయ పెట్టుబడిదారులు యూఎస్ స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడానికి రెండు ప్రాథమిక మార్గాలను అన్వేషించవచ్చు. ప్రత్యక్ష పెట్టుబడి అంటే యూఎస్ కంపెనీల షేర్లను నేరుగా కొనుగోలు చేయవచ్చు. పరోక్ష పెట్టుబడి అంటే



మ్యూచువల్ ఫండ్స్ లేదా ఎక్స్ఛేంజ్–ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) ద్వారా ఎక్స్‌పోజర్ పొందవచ్చు.

**ప్రత్యక్ష పెట్టుబడి**

చాలా మంది భారతీయ బ్రోకర్లు యూఎస్ బ్రోకర్లతో భాగస్వామ్యాలను కలిగి ఉన్నారు. దీని వల్ల మీరు విదేశీ ట్రేడింగ్ ఖాతా ద్వారా యూఎస్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టవచ్చు. ఖాతాను తెరవడానికి మీరు డాక్యుమెంటేషన్‌ను అందించాల్సి ఉంటుంది. కానీ పెట్టుబడి ఉత్పత్తులపై పరిమితులు లేదా ట్రేడింగ్ ఫ్రీక్వెన్సీ వంటి కొన్ని పరిమితులు వర్తించవచ్చని గమనించడం ముఖ్యం. అదనంగా ఇందులో ఉన్న ఛార్జీల గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. బ్రోకరేజ్ ఫీజులు మరియు కరెన్సీ మార్పిడి ఖర్చులు గణనీయంగా ఉంటాయి.

విదేశీ బ్రోకర్ అంటే మీరు చార్లెస్ ష్వాబ్, అమెరిట్రేడ్ లేదా ఇంటరాక్టివ్ బ్రోకర్స్ వంటి భారతదేశంలో పనిచేసే యూఎస్ ఆధారిత బ్రోకర్‌తో నేరుగా విదేశీ ట్రేడింగ్ ఖాతాను కూడా తెరవవచ్చు. ఈ బ్రోకర్లు సాధారణంగా విస్తృత శ్రేణి పెట్టుబడి ఎంపికలను అందిస్తారు. కమిట్ అయ్యే ముందు ఫీజు నిర్మాణం, ట్రేడింగ్ పరిస్థితులను మీరు అర్థం చేసుకోవాలి.


# స్పోర్ట్స్

## పూరన్‌కు బంపరాఫర్

**-ఎంఐ న్యూయార్క్ జట్టుకు సారథిగా ఎంపిక**

**తెలంగాణవీణ, క్రీడలు : న్యూయార్క్**

రెండ్రోజుల క్రితమే అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన వెస్టిండీస్ మాజీ సారథి నికోలస్ పూరన్‌కు బంపరాఫర్ దక్కింది. శుక్రవారం (జూన్ 13) నుంచి అమెరికా వేదికగా జరగాల్సి ఉన్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) మూడో సీజన్‌లో అతడు.. ఎంఐ న్యూయార్క్ ఫ్రాంచైజీకి కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు యజమానులుగా వ్యవహరిస్తున్న రిలయన్స్.. న్యూయార్క్ జట్టునూ దక్కించుకున్న విషయం విదితమే. ఎంఎల్‌సీ 2023 సీజన్‌లో న్యూయార్క్ తరఫున ఆడిన పూరన్.. 388 పరుగులతో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. గత సీజన్‌లో ఆశించిన



స్థాయిలో రాణించకున్నా పూరన్‌పై నమ్మకముంచిన ఎంఐ.. అతడికి సారథ్య బాధ్యతలు అప్పగించింది. న్యూయార్క్ జట్టులో పూరన్‌తో పాటు రషీద్ ఖాన్, పొలార్డ్, డికాక్ వంటి అంతర్జాతీయ స్టార్లు కూడా ఉన్నారు. ఈనెల 13 నుంచి జులై 14 దాకా ఎంఎల్‌సీ మూడో సీజన్ జరగాల్సి ఉంది.

## ఆస్ట్రేలియన్లకు దడ పుట్టిస్తున్న సఫారీ పేసర్లు..

**– రసపట్టులో డబ్ల్యూటీసీ ఫైనల్..!**

**తెలంగాణవీణ, క్రీడలు :**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. మొదటి రోజు నుంచి సెషన్ సెషన్‌కు ఆధిపత్యం మారతూ వస్తున్న మ్యాచ్‌లో టీ సెషన్ తర్వాత దక్షిణాఫ్రికా పట్టుబిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 138 ఆలౌటైన సఫారీ టీమ్.. అనంతరం బౌలర్ల విజృంభణతో ఆసీస్‌ను ఆలౌట్ అంచున నిలిపింది. పేస్‌కు అనుకూలిస్తున్న పిచ్ మీద కగిసో రబడ(2–15), లుంగి ఎంగిడి(3–35)లు కంగారూ బ్యాటర్లకు దడ పుట్టించగా కమిన్స్ సేన 73కే ఏడు వికెట్లు కోల్పోయి.. మ్యాచ్‌ను చేజార్చుకునే ప్రమాదంలో పడింది.లార్డ్స్ వేదికగా జరుగుతున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆద్యంతం



ఉత్కంఠగా సాగుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌట్ ప్రమాదంలో పడింది. దక్షిణాఫ్రికాను 138 కే కట్టడి చేసిన ఆసీస్ భారీ స్కోర్‌తో విజయంపై గురి పెట్టింది. అయితే.. సఫారీ పేసర్ కగిసో రబడ(2–15) ప్రత్యర్థిని ఆదిలోనే దెబ్బకొట్టాడు. డేంజరస్ ఉస్మాన్ ఖవాజా(6), కామెరూన్ గ్రీన్(0)లను ఔట్ చేసి కంగారూలకు షాకిచ్చాడు. ఆ తర్వాత లుంగి ఎంగిడి(3–35) తన మ్యాజిక్ చూపిస్తూ స్టీవ్ స్మిత్(13)ను ఎల్బీగా వెనక్కి పంపాడు.అంతే.. ఆసీస్ వికెట్ల పతనం మొదలైంది. కాసేపటికే మల్డర్ సూపర్ బాల్‌తో ట్రావిస్ హెడ్()ను బౌల్డ్ చేయగా..64కే ఐదో వికెట్ పడింది. వరుసగా వికెట్లు పడుతున్న జట్టును ఆదుకుంటాడనుకున్న కమిన్స్(6)ను ఎంగిడి బౌల్డ్ చేసి వాళ్ల కష్టాలను మరింత పెంచాడు. ప్రధాన ఆటగాళ్లంతా పెవిలియన్ చేరిన వేళ వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ(14) ఒంటరిపోరాటం చేస్తున్నాడు. ప్రస్తుతానికి ఆధిక్యం 165 ఉంది. టెయిలెండర్లతో కలిసి జట్టు ఆధిక్యాన్ని 200కు పెంచే ప్రయత్నంలో ఉన్నాడు.

## ఇంగ్లండ్ పర్యటనకు మ్యాచ్ విన్నర్..

### వన్డే, టీ20లకు భారత స్క్వాడ్ ఇదే..!



**తెలంగాణవీణ, క్రీడలు :**

భారత మహిళల క్రికెట్ జట్టు త్వరలోనే వన్డే, టీ20ల సిరీస్‌ల కోసం ఇంగ్లండ్ పర్యటన కు వెళ్లనుంది. రెండు ఫార్మట్ల సిరీస్‌లో విజయమే లక్ష్యంగా పెట్టుకుంది హర్మన్‌ప్రీత్ కౌర్ సేన. అందుకే గురువారం మహిళా సెలెక్షన్ కమిటీ పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. గాయపడిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ షుచీ ఉపాధ్యాయ్ స్థానాన్ని రాధా యాదవ్ భర్తీ చేయనుందని తెలిపారు సెలెక్టర్లు. స్పిన్ ఆల్‌రౌండర్, మ్యాచ్ విన్నర్ అయిన రాధ చేరికతో స్క్వాడ్ మరింత బలోపేతంగా మారింది. ఈ విషయాన్ని గురువారం బీసీసీఐ వెల్లడించింది.'స్పిన్నర్ షుచీ గాయంతో ఇంగ్లండ్ పర్యటనకు దూరమైంది. నేషనల్ క్రికెట్ అకాడమీ లో బీసీసీఐ నిర్వహించిన ప్రీ– క్యాంప్‌లో ఆమె షిన్ బోన్ గాయంతో బాధపడింది. దాంతో ఆమె స్థానంలో రాధా యాదవ్‌ను మహిళా సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియా.. ఇంగ్లండ్ జట్టుతో 5 టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

**వన్డే స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ్ రానా, శ్రీ చరణి, అమన్‌జోత్ కౌర్, అరుంధతీ రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే, రాధా యాదవ్.

**టీ20 స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ్ రానా, శ్రీ చరణి, అమన్‌జోత్ కౌర్, అరుంధతీ రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే, రాధా యాదవ్. ఇరుజట్లు మధ్య జూన్ 28న నాటింగ్‌హమ్ వేదికగా జరిగే టీ20 మ్యాచ్‌తో సిరీస్ ఆరంభం కానుంది.




# బన్నీవాస్, ప్రియదర్శి మిత్రమండలి టీజర్ వచ్చేసింది

**తెలంగాణవీణ, సినిమా :**
అల్లు అర్జున్ స్నేహితుడిగా, గీతా ఆర్ట్స్2 వ్యవహారాలు చూసుకుంటున్న బన్నీ వాస్ సడన్‌గా కొత్తగా బీవీ వర్క్స్ పేరిట కొత్త బ్యానర్ స్థాపించి సప్త అశ్వ క్రియేటివ్స్ , వైరా ఎంటర్టైన్మెంట్స్ సంస్థలతో కలిసి సంయిక్తగా రూపొందిస్తున్న సినిమా మిత్రమండలి . ఇటీవలే ఈ చిత్రం టైటిల్, నటులను రివీల్ చేసిన మేకర్స్ గురువారం ప్రత్యేక ఈవెంట్ నిర్వహించి మిత్రమండలి టీజర్ విడుదల చేశారు. ఈ సినిమాలో ప్రియదర్శి, రాగ్ మయూర్ , ప్రసాద్ బెహరా , విష్ణు కీలక పాత్రల్లో నటిస్తుండగా ఇన్ ఫ్లూయెన్సర్ నిహారిక టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుంది. తాజాగా రిలీజ్ చూస్తే ఫన్, మిస్టరీ జానర్‌లో మూవీని రూపొందించినట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంతో విజయేందర్ ఎస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమాకి సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తున్నాడు. శరవేగంగా ఈ సినిమా పూర్తి చేసి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

# ఆ హీరో ఒక సైలెంట్ కిల్లర్..

## త్రిష ఇంట్రెస్టింగ్ కామెంట్స్.




**తెలంగాణవీణ, సినిమా :**
దక్షిణాది చిత్రపరిశ్రమను 20 ఏళ్లుగా శాసిస్తోన్న హీరోయిన్ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు త్రిష. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషలలో పలు చిత్రాల్లో నటించి అనేక విజయాలను అందుకుంది. అన్ని ఇండస్ట్రీలలో దాదాపు అందరూ స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. 1999లో జోడి చిత్రంలో చిన్న పాత్రతో సినీప్రయాణం స్టార్ట్ చేసిన ఈ అమ్మడు.. ఆ తర్వాత నీ మనసు నాకు తెలుసు సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత ప్రభాస్ సరసన వర్షం మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. దీంతో ఈ బ్యూటీకి సౌత్ ఇండస్ట్రీలో విపరీతంగా అవకాశాలు వచ్చాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా వరుస చిత్రాలతో వెండితెరపై సందడి చేస్తుంది. ప్రస్తుతం ఆమె వయసు 41 సంవత్సరాలు. ఇప్పటికీ ఏమాత్రం తరగని అందం.. చేతినిండా సినిమాలతో కుర్ర హీరోయిన్లకు గుబులు పుట్టిస్తోంది. ఈ ఏడాది వరుసగా హ్యాట్రిక్ హిట్టు కొట్టిన త్రిష.. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న విశ్వంభర చిత్రంలో నటిస్తుంది. అలాగే తెలుగు, తమిళంలో మరిన్ని చిత్రాల్లో కనిపించనుంది. ఇదిలా ఉంటే.. గతంలో త్రిషకు సంబంధించిన ఓ పాత ఇంటర్వ్యూ వీడియో నెట్టింట తెగ వైరలవుతుంది. అందులో విజయ్ దళపతి ఫోటోను చూపిస్తూ పలు ప్రశ్నలు అడిగారు యాంకర్. దీంతో విజయ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. “విజయ్ ఓ చాలా డిఫరెంట్.. షూటింగ్ సమయంలో అతడు చాలా నిశ్శబ్దంగా ఉంటాడు. అందుకే అతడిని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. కానీ సినిమా కోసం ఎంతో కష్టపడుతుంటారు. అతడు ఎల్లప్పుడూ నాకు సరికొత్తగా కనిపిస్తుంటారు” అంటూ చెప్పుకొచ్చింది. విజయ్, త్రిష కలిసి దాదాపు 5కి పైగా సినిమాల్లో నటించారు. గిల్లీ, తిరుపాచి,

# అందానికే అసూయ పుట్టిస్తున్న జెనిలియా..!

## 37 ఏళ్ల వయసులో స్టన్నింగ్ లుక్స్‌తో



**తెలంగాణవీణ, సినిమా :**
జెనీలియా గురించి తెలుగు సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. తెలుగుతోపాటు తమిళం, హిందీ భాషలలో అనేక చిత్రాల్లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ.. ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల సరసన అనేక చిత్రాల్లో కనిపించింది. ఆగస్టు 5, 1987న జన్మించిన జెనీలియా తుజే మేరీ కసమ్ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఇందులో రితేష్ దేశ్ ముఖ్ హీరోగా నటించారు. మొదటి సినిమా సమయంలో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. కొన్నాళ్లపాటు ప్రేమలో ఉన్న వీరిద్దరు పెళ్లితో ఒక్కటయ్యారు. బాయ్స్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన జెనీలియా.. ఆ తర్వాత బొమ్మరిల్లు, సాంబ, ఆరెంజ్, నా అల్లుడు వంటి చిత్రాల్లో నటించింది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే తన ప్రియుడు రితేష్ దేశ్ ముఖ్ ను 2012లో ఇరు కుటుంబాల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. జెనీలియా భర్త రితేశ్ దేశ్ ముఖ్ రాజకీయ కుటుంబానికి చెందినవారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విలాస్ రావ్ తనయుడు. మొదట్లో వీరి ప్రేమకు రితేశ్ తండ్రి అంగీకరించలేదు. కానీ తర్వాత వీరి పెళ్లిని ఒప్పుకున్నారు. జెనీలియా, రితేశ్ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు. చాలా సంవత్సరాలు సినీరంగానికి దూరంగా ఉన్న జెనీలియా... ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం హిందీలో వరుస సినిమాల్ల నటిస్తుంది. తాజాగా ఆమె ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ కట్టిపడేస్తున్నాయి. అందంలో అప్సరసలా కనిపిస్తుంది.




# హరిహర వీరమల్లుపై క్రేజీ అప్‌డేట్..

## క్లైమాక్స్ వీఎఫ్ఎక్స్ కోసం అన్ని కోట్లు ఖర్చు పెట్టారా..!

**తెలంగాణవీణ, సినిమా :**
పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్రో చిత్రం తర్వాత మళ్లీ సినిమా చేయలేదు. ఆయన సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హరిహర వీరమల్లు చిత్రం జూన్‌లో విడుదల అవుతుందని ఆశగా ఎదురు చూసారు. కాని పలు కారణాల వలన వాయిదా పడుతూ వస్తుంది. హరిహర వీరమల్లు సినిమా ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం నిర్మాణ సారథ్యంలో రూపొందుతుంది. ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడితోపాటు జ్యోతికృష్ణ దర్శకత్వ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సినిమా వాస్తవంగా జూన్ 12వ తేదీన రిలీజ్ కావాల్సి ఉన్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు, కొన్ని వీఎఫ్ఎక్స్ వర్కులు పూర్తి కానందున మూవీ వాయిదా పడింది. హరిహర వీరమల్లు చిత్రం భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతుంది. స్టోరీ డిమాండ్ చేయడం వల్ల ఎక్కువగా గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ వర్క్ అవసరం ఏర్పడింది. ఇరాన్ తో పాటు ఇతర దేశాల్లో టెక్నికల్ వర్క్ జరుగుతున్నది. అయితే ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడం, హడావిడిగా చివరి నిమిషంలో విడుదల చేయడం ఎందుకనే ఉద్దేశంతో మేకర్స్ మరోసారి మూవీని వాయిదా వేసినట్టు తెలుస్తుంది. ఇంకా ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే దానిపై క్లారిటీ లేదు. ఇక ఇదిలా ఉంటే ఈ సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్ నెవర్ బిఫోర్ లెవెల్లో ఉంటుంది అని మేకర్స్ ప్రామిస్ చేశారు. తాజా సమాచారం ప్రకారం హరిహర వీరమల్లులో మొత్తం 6000 విఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్నాయట. అలాగే ప్రతీ షాట్ లో 10 లేయర్స్ ఉంటాయని, మొత్తం వర్క్ అంతా ఒకెత్తు అయితే ఒక్క క్లైమాక్స్ పోర్షన్ విఎఫ్ఎక్స్ వేరే లేవల్‌లో ఉంటుందట. క్లైమాక్స్ కోసమే మేకర్స్ ఏకంగా 25 కోట్లు వెచ్చించినట్టుగా తెలుస్తుంది. సినిమా అద్భుతంగా వచ్చేందుకు మేకర్స్ ఎక్కడా కూడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని ఆడియెన్స్ కి మంచి ఎక్స్ పీరియన్స్ ఇచ్చేలా సిద్ధం చేస్తున్నారట. జూన్ 12న రిలీజ్ కావల్సిన ఈ చిత్రం వాయిదా పడడంతో జులై 4న రిలీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి..

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written